క్లుప్తంగా

31న విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

మరికల్: మా స్నేహితుల ఆధ్వర్యంలో ఈ నెల 31న పదోతరగతి విద్యార్థులకు మండలంలోని టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పరీక్ష ఫీజు రూ. 50చెల్లించిన వారికి ఈ పరీక్ష రాసే అవకాశం ఉంటుందన్నారు. టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు నంబర్‌కు 9966830389 సంప్రదించాలన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక



దామరగిద్ద: ఎమ్మార్పీఎస్ మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు కల్యాణ్ సమక్షంలో అధ్యక్షుడిగా రాములు, అధికారి ప్రతినిధిగా ఆనంద్, ఉపాధ్యక్షుడిగా అశోక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిబ్రవరి 7న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. నరేందర్, రాజు, లక్ష్మణ్, మోహన్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



కొత్తపల్లి: మండల పరిధిలోని దుప్పడిగట్టు గ్రామానికి చెందిన గడ్డం తిరుమలయ్యకు మంగళవారం సీఎం సహాయనిధి చెక్కును అల్లీపూర్ మాజీ సర్పంచ్ రమేష్‌రెడ్డికి అందించారు. అనారోగ్యంతో కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకొని సీఎం సాయం కోసం అప్పీలు చేసుకోగా మంజూరైన రూ. 50వేల చెక్కును అందించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల వివరాలు నమోదు చేయాలి



నర్వ: పాఠశాలల వివరాలను ఆన్‌లైన్ ఆప్‌లో నమోదు చేయాలని ఎంఈఓ రామకృష్ణ అన్నారు. మంగళవారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల వివరాల నమోదును ఎప్పటికప్పుడు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ నర్సింహులు, ఎంఐసీ రైసభాను, ప్రైవేట్ పాఠశాలల హెచ్ఎంలు శ్రీజేష్, సత్యనారాయణ, సత్యం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి టెన్నికాయిట్ జట్టు ఎంపిక

మక్తల్: జిల్లా స్థాయి టెన్ని కాయిట్ జూనియర్స్ ఎంపికలను పట్టణంలో సాయిజ్యోతి ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.దీప మంగళవారం తెలిపారు. జిల్లా అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. వీరిని ఈనెల 26న హైదరాబాద్ అంబర్‌పేట టెన్నికాయిట్ మైదానంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు. కార్యక్రమంలో అంబ్రేష్, రమేష్, దామోదర్ పాల్గొన్నారు.

విద్యార్థులను పనులకు పంపొద్దు

మరికల్: చదువుకునే విద్యార్థులను పనులకు పంపించకుండా పాఠశాలకు పంపాలని సీఆర్పీ శివకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కన్మనూర్‌లో పాఠశాల హాజరు రిజిష్టర్ ఆధారంగా ఉపాధ్యాయుల చొరవతో విద్యార్థుల డ్రాప్ అవుట్ వివరాలను సేకరించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి.. వారిని తిరిగి పాఠశాలలో చేర్పించారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులను పనులకు పంపిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తిలో అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి భీష్మ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రాజ్‌కుమార్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫౌండేషన్ ద్వారా రూ. 11లక్షలు తమవంతుగా ఆర్థిక సహాయంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆయనను శాలువాతో సత్కరించారు.



మందిపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



కోస్గి సభలో మాట్లాడుతున్న అధికారులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కొత్తపల్లి: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు లబ్ధి చేకురుతుందని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని దుప్పటి గట్టులో నిర్వహించిన గ్రామ సభలో వారు పాల్గొని మాట్లాడారు.. గ్రామసభలో లబ్ధిదారుల జాబితాను ఆర్డీఓ రాంచందర్ చదివి వినిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ.. జాబితాలో పేర్లు రానివారు నిరాశ చెందొద్దని, అర్హత కలిగిన వారందరూ కూడా మళ్లీ గ్రామసభలో లేదా ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులందరికీ పథకాలు వర్తిసాయని కలెక్టర్ గ్రామస్తులకు తెలిపారు. గ్రామ సభలో తహసీల్దార్ జయరాములు, మండల వ్యవసాయ అధికారి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.



దుప్పటి గట్టు గ్రామసభలో పాల్గొన్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

పెద్దకడ్మూర్‌లో..

నర్వ: పెద్దకడ్మూర్‌లో నిర్వహించిన గ్రామసభలో అదనపు కలెక్టర్ బెన్‌శాలం పాల్గొని మాట్లాడారు.. ఈ నెల 26నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న పథకాలపై గ్రామస్తులకు వివరించారు. ఈ గ్రామ సభలో ప్రత్యేక అధికారులు ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ మల్లారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరుస్తాం..

మాగనూర్/కృష్ణా: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూస్తామని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మండలంలోని మందిపల్లిలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు.. అర్హులకు ఇందిరమ్మ పథకం ద్వారా ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేరుస్తామని అన్నారు. అలాగే కృష్ణ మండలం చేగుంటలో నిర్వహించిన గ్రామసభలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. అనంతరం లబ్ధిదారుల జాబితాలను ప్రకటించారు. అదేవిధంగా మండలంలోని అడవి సత్యావర్‌లో శిక్షణ కలెక్టర్ గరిమానరుల ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు అందజేస్తాం

మద్దూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులు అందుతాయని డీఎస్ఓ సుదర్శన్ తెలిపారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అర్హత ఉండి రేషన్‌కార్డుల జాబితాలో లేని వారు గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకో వాలని సూచించారు. 13మండలాలు కలిపి 12,639 రేషన్‌కార్డుల జాబితా వచ్చిందని, వాటిని సర్వే చేయించి అందులో అర్హులను గుర్తించి గ్రామ సభలో ఉంచామని గుర్తుచేశారు.

● అలాగే మండలంలోని ఆత్మీయ భరోసాకు 13మంది లిస్టులో ఉండగా గ్రామ సభలో 2 ఇద్దరికి భూమి ఉందని తెలిందని ఎంపీడీఓ నర్సింహారెడ్డి పేర్కొన్నారు.

గ్రామసభల్లో లబ్ధిదారుల ఎంపిక

కోస్గి రూరల్: మండలంలో పలు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. అనంతరం వివిధ పథకాల జాబితాలను అధికారులు సభలో వినిపించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, నాయకులు రఘువర్దన్, భీంరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

● ధన్వాడ మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన గ్రామ సభలో ఎంపీడీఓ సాయిప్రకాష్ పాల్గొని మాట్లాడారు..

దరఖాస్తుల పరిశీలన

దామరగిద్ద: ప్రభుత్వ పథకాలను దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తులను గ్రామ సభలో పరిశీలిస్తున్నట్లు ఎంపీడీఓ సాయిలక్ష్మి అన్నారు. అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రసాభాసగా గ్రామ సభ

మరికల్: మండలంలోని రాకొండలో జరిగిన గ్రామ సభను గ్రామస్తులు అడ్డుకున్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద అధికారులు పథకాలు చదివి గ్రామస్తులకు వినిపిస్తుండగా.. అర్హులకు కాకుండా అనర్హులకు ఇళ్లు ఎలా మంజూరు చేశారని అధికారుల ఎదుట ఆందోళనకు దిగారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో అక్కడకు చేరుకున్న ఎస్ఐ రాము ఆందోళన కారులను అదుపులోకి తీసుకొని గ్రామసభను ప్రారంభించారు.

● ఊట్కూరులో నిర్వహించిన గ్రామ సభలో రేషన్ కార్డులకోసం కొత్త దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్, తహసీల్దార్ రవి పాల్గొన్నారు.



దామరగిద్ద మండలం పిడెంపల్లి సభలో ..



ఊట్కూర్ మండలం తిప్పరాస్‌పల్లిలో



ధన్వాడ సభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఉద్యోగ విరమణ వయస్సు పెంపు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

నారాయణపేట రూరల్: పెన్షనర్ల చెల్లింపులు వాయిదా వేయడం కోసం ఉద్యోగ విరమణ వయస్సు పెంచాలని ప్రభుత్వ యోచన సరికాదని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.రవికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సీఐటీయూ భవనంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15శాతం కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర మాజీ కోశాధికారి కృష్ణయ్య, కూర శివరాములు, ప్రధాన కార్యదర్శి ఎ.వెంకటస్వామి, కె బాలాజీ, భీమయ్య, కృష్ణగౌడ్, రవికుమార్, సాయప్ప, మోహన్ పాల్గొన్నారు.

గ్రామసభ వేదికపై రాజకీయ నాయకులా?

మాగనూర్: ప్రజా పాలనలో భాగంగా మండలంలోని మందిపల్లిలో మంగళవారం నిర్వహించిన గ్రామ సభ వేదికపై రాజకీయ నాయకులు కూర్చోవడంపై మండల బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామ సభకు ప్రాతినిధ్యం వహించేది అధికారుల లేక ప్రజాప్రతినిధులా లేక రాజకీయ పార్టీల నాయకుల అర్థం కావడం లేదన్నారు. ప్రజా పాలనలో ప్రజలకు పూర్తిస్థాయిలో పథకాలను అమలు చేసి న్యాయం చేయాలన్నారు.

గ్రామసభలు ప్రారంభం

నారాయణపేట రూరల్: మండలంలో ఆయా గ్రామల్లో గ్రామ సభలు కొనసాగాయి. ఎంపీడీఓ సుదర్శన్, తహసీల్దార్ అమరేంద్ర కృష్ణ, డిప్యూటీ తాసిల్దార్ రామకృష్ణ హాజరై ప్రజల నుంచి ఇందిరమ్మ ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు.

ఆధార్ కేంద్రాలు లేక పరేషాన్

● అపార్ నమోదుతో విద్యార్థుల ఇబ్బందులు
● మూతబడిన రెండు ఆధార్ కేంద్రాలు

మద్దూరు : మండలంలో ఆధార్ కేంద్రాలు పనిచేయకపోవడంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలోని ఈఎస్‌డీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రం సాంకేతిక కారణాలతో నెలన్నర రోజులుగా పనిచేయడం లేదు. అదే విధంగా ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో మద్దూరు ప్రాథమిక పాఠశాల అవరణలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్ ఏజెన్సీకి గడువు ముగియడంతో అది కూడా నెలన్నర రోజుల క్రితం మూతపడింది. దీంతో మండలంలో నూతన ఆధార్, మార్పులు చేర్పుల కోసం ప్రజలు ఇతర మండలాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.



మద్దూరులో సేవలు నిలిచిపోయిన ఆధార్ కేంద్రం


అపార్ నమోదుతో విద్యార్థుల ఇబ్బందులు..

ప్రతి విద్యార్థి సమాచారం ఒకే కార్డులో నిక్షిప్తం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అపార్(ఏపీఏఏఆర్) ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు అపార్‌లో నమోదు చేసుకోవడానికి ఆధార్ కార్డు ప్రామాణికం. ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో చాల మంది ఆధార్ కార్డులో ఒక విధంగా, యూడైస్‌లో ఒక విధంగా పేర్లు గానీ, పుట్టిన తేదీ, తదితర మార్పులు ఉండడంతో ఆధార్‌లో సరిచేసుకోవాడినికి ఆధార్ కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలో ఉన్న రెండు ఆధార్ కేంద్రాలు పనిచేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇతర మండలాలకు తీసుకెళ్లి ఆధార్‌లో మార్పులు చేర్పులు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తక్షణం ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అపార్ నమోదు 10 శాతం మాత్రమే..

ఈనెల 25 వరకు మండలంలోని అన్ని పాఠశాలల్లో అపార్ నమోదు చేయాలని ఆదేశాలు ఉన్నా ఇప్పటి వరకు మండలంలో 10 శాతం మాత్రమే అపార్ నమోదు పూర్తయిందని విద్యాశాఖ అధికారులు తెలియజేశారు. మండలంలోని 58 ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో 8,690 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరితో దాదాపు 70 నుంచి 80 శాతం వరకు ఆధార్‌లో మార్పులు చేర్పులే ఉన్నాయని ఆయా పాఠశాలలో ఉపాధ్యాయులు తెలిపారు.

ఆధార్ కేంద్ర ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాం..



ఆధార్ కేంద్ర ఏర్పాటు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉంటుంది. ఇక్కడ అధార్ సెంటర్లు నిబంధనల అతిక్రమణ, సాంకేతిక సమస్యల కారణంగా మూతపడ్డాయి. దాదాపు నెలన్నర నుంచి ఆధార్ సెంటర్లు పనిచేయడం లేదు. వీటికి ప్రత్యమ్నాయంగా మరో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాం.

– విజయ్‌కుమార్, ఈడీఎం, నారాయణపేట

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

నారాయణపేట రూరల్/ఎడ్యుకేషన్: నూతన క్యాలెండర్, డైరీలను ఎమ్మెల్యే పర్ణికారెడ్డి సీవీఆర్ భవనంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మనోహర్ ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ సర్వీస్‌లో ఉన్న ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు వెల్‌నెస్ సెంటర్, డైలాసిస్ సెంటర్‌ను మంజూరు చేయించా ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వాలకు ఎంతో సేవను అందించిన రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని తెలిపారు.



క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

పీఆర్టీయూ ఆధ్వర్యంలో..

పీఆర్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వారికి డైరీని అందజేశారు.సంతోష్‌కుమార్, జనార్దన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, రఘువీర్, జహోరోద్దీన్ పాల్గొన్నారు.

బాలకేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేయాలి..

సంస్కృతి, సాంప్రదాయాలను భవిష్యత్‌రాలకు అందిస్తూ కళలకు కొత్త జీవాన్ని పోస్తున్న బాల కేంద్రాన్ని అప్ గ్రేడ్ చేసి బాలభవన్‌గా మార్చాలని సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి కోరారు. సీవీఆర్ భవన్‌లో ఎమ్మెల్యేని కలిసి వినతిపత్రం అందించారు.

ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక భావన పెంపొందించాలి



నగర సంకీర్తనలో పాల్గొన్న శ్రీ సిద్ధలింగస్వామి

ఊట్కూరు: ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక భావన, దైవ భక్తిని పెంపొందించాలని శ్రీ సిద్ధలింగేశ్వరస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని మహాస్వామివారి 60వ పుణ్యారాధన ఉత్సవంలో భాగంగా నగర సంకీర్తన ధర్మజాగృతి ప్రవచనం చేపట్టారు. శ్రీరాంనగర్ ఆంజనేయస్వామి ఆలయం నుంచి గ్రామ పురవీధుల్లో శివనామస్మరణ చేస్తూ ఎల్‌బీనగర్ ఆంజనేయస్వామి ఆలయం వరకు కొనసాగింది. ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు సమాజంలో పాశ్చాత్య సంస్కృతి పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నప్పటి నుంచే దేశభక్తి, దైవభక్తి, మన సంస్కృతి సాంప్రదాయాలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో భక్తులు భాస్కర్, నీల్‌రాజు, లక్ష్మారెడ్డి, కృష్ణయ్యగౌడ్, రఘువీర్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్స్ శిక్షణ విజయవంతం

నారాయణపేట రూరల్: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించి సాంకేతికతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా సోహం అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రోబోటిక్స్ ఇన్ అకాడమిక్స్ కార్యక్రమం మంగళవారం జిల్లాలో విజయవంతంగా నిర్వహించారు. ఆరు ప్రభుత్వ పాఠశాలను, ఒక ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో 834మంది చిన్నారులకు రోబోటిక్స్ ప్రాథమిక సూత్రాలను నేర్పించారు. అనంతరం ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్, ఆయా విద్యా సంస్థకు రోబోటిక్స్ కిడ్స్ పంపిణీ చేశారు. ఏడాది పొడవునా ఇన్నోవేషన్ చాలెంజ్‌లో ఆయా విద్యార్థులు పాల్గొనవచ్చని, వార్షిక రోబోటిక్స్ ప్రదర్శనలో ప్రతిభ చూయించేందుకు అవకాశం దొరుకుతుందని సూచించారు. మరికల్ గర్ల్స్ లో 121, ధన్వాడ గర్ల్స్ లో 108, చిత్తనూరు బాయ్స్‌లో 176, చిన్న పొర్లలో 148, జాజాపూర్ 122, బొమ్మనుపాడు 97తో పాటు స్ఫూర్తి డిగ్రీ కళాశాల 62మంది పాల్గొన్నారు.



శిక్షణ తీసుకుంటున్న చిన్నారులు

యువతకు స్ఫూర్తి ప్రదాత వివేకానందుడు



విగ్రహానికి పూజలు చేస్తున్న సభ్యులు

దామరగిద్ద: స్వామి వివేకానందుడు యువతరానికి స్ఫూర్తి ప్రదాత అని రామకృష్ణ సేవాసమితి సభ్యులు కృష్ణ, మోహన్, నర్సింహులు అన్నారు. మంగళవారం మండలంలోని మద్దెల్‌బీడ్ గ్రామ రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంతో వివేకానందుడి జయంతి ఉత్సవాలను నిర్వహించారు. చిన్నారులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. అంతకుముందు మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు వెంకటప్ప రాఘవేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, హన్మంతు, శాంత్‌కుమార్, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ జాతర

నారాయణపేట రూరల్: పట్టణంలోని సమీపంలో ఉన్న మహాపుర ఎల్లమ్మ జాతరను స్వకుళ సాలి సమాజ్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. మంగళవారం మర్గమ్మ ఆలయం నుంచి పల్లకి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహానికి అభిషేకం, ప్రత్యేక పూజలతో పాటు నైవేద్యం, మహా మంగళహారతి తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో సభ్యులు రమేష్ జరంగ్, విజయ్ ఎడికే, కృష్ణ గుండా, అంబర్ నాథ్ కాంబ్లె కిషోర్ దొత్రే తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గోఆధారిత వ్యవసాయంతో మేలు

మక్తల్: గోఆధారిత వ్యవసాయంతో రైతులతో పాటు ప్రజలకు మేలు చేకూరుతుందని వీఓణ ప్రముఖ్ రాజవర్ధన్‌రెడ్డి, అనాకులం గోకులం గోశాల నిర్వాహకుడు రఘుప్రసన్న భట్ అన్నారు. మంగళవారం మండలంలోని దాసర్‌దొడ్డి శివారులో గోఆధారిత ప్రకృతి సేద్యంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రసాయనిక ఎరువుల వినియోగంతో భూమిలో సారం తగ్గి పంట దిగుబడి రాదన్నారు. ఆవు మూత్రం, పేడతో జీవామృతం కషాయాలతో పంటలు పండించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో క్షేత్ర గోసేవ ప్రముఖ్ ఆకుతోట రాములరావు, గంగుల ముకుందరెడ్డి, కొండయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



దాసర్‌దొడ్డిలో అవగహన సదస్సు నిర్వాహకులు

ఇళ్ల మధ్యే డ్రైయినేజీ మురుగు



ఇళ్ల మధ్య నిలిచిన డ్రైయినేజీ మురుగు

అమరచింత: మండలంలోని నందిమళ్ల గ్రామంలో డ్రెయినేజీ నుంచి మురుగు వచ్చి ఇళ్లలోకి చేరడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామ ప్రత్యేక అధికారిగా ఎంపీడీఓ శ్రీనివాసులు ఉన్నా గ్రామ సమస్యలను పట్టించుకోవడం లేదని, కనీసం గ్రామంలోని కాలనీలను సందర్శించట్లేదని ధ్వజమెత్తారు. మురుగు నీరు ఇళ్లలోకి చేరడమే కాకుండా విషపురుగులు సంచరిస్తుండడంతో భయాందోళనల నడుమ నెట్టుకొస్తున్నామని వాపోయారు. పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు విన్నవించినా ఏనాడు మురుగు మళ్లించే ప్రయత్నం చేయలేదని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళన నిర్వహిస్తామన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించామన్నామని పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ తెలిపారు.